క్లుప్తంగా

మహారాష్ట్రకు వెళ్లిన ప్రజాప్రతినిధులు



మంత్రులతో ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, సతీశ్‌బాబు, రసమయి

గోదావరిఖని: సీఎం కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ భానుప్రసాద్‌రావు, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తదితరులున్నారు.

ఎమ్మెల్యే దాసరి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: మండలంలోని పలు గ్రామాలకు తారు రోడ్ల నిర్మాణానికి రూ.36 కోట్లు విడుదల చేయించారని హర్షం వ్యక్తంచేస్తూ మండలంలోని కొలనూర్‌లో పెద్దపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఓదెల టూ పెద్దపల్లి వయా కొలనూర్, కొత్తపల్లి, పెద్దబొంకూర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ పాకాల సంపత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి చైర్మన్ బండారి ఐలయ్యయాదవ్, వేణుగోపాలస్వామి గుడి చైర్మన్ కలకొండ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మారం తహసీల్దార్‌గా కేవై ప్రసాద్



తహసీల్దార్ కేవై ప్రసాద్

ధర్మారం: ధర్మారం మండల తహసీల్దార్‌గా కేవై ప్రసాద్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను పెద్దపల్లి కలెక్టరెట్‌కు బదిలీ చేయగా కలెక్టరేట్‌లో పనిచేసిన కేవై ప్రసాద్ ధర్మారం తహసీల్దార్‌గా కలెక్టర్ బదిలీ అయ్యారు.

నియామకం

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లికి చెందిన నేత్రవైద్య సహాయకుడు పూదరి దత్తాగౌడ్‌ను లయన్స్‌క్లబ్ దృష్టి సంరక్షణ చైర్మన్‌గా నియమించినట్లు లయన్స్ క్లబ్ గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దత్తాగౌడ్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. దత్తాగౌడ్‌ను క్లబ్ సభ్యులు చిదుర సురేశ్, కట్కూరి సత్యనారాయణ, మాదర్ ఖాన్, అలీ, అబ్దుల్ వాసే, బుద్ధర్తి సతీశ్, భూతగడ్డ చందు, సోన్నాయి టెంకమ్ అశోక్ అభినందించారు.

'ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

గోదావరిఖని టౌన్ : గోదావరిఖనిలోని కృష్ణవేణి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తఫా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. అడ్డగుంటపల్లి, మార్కండేయ కాలనీలోని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, నాణ్యమైన విద్య అందించడం లేదన్నారు. సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ దూళికట్ట సతీశ్, తదితరులున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 ఏరియాలో చేడుతున్న స్వచ్ఛత పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం సెంటనరీకాలనీ బంగ్లాస్ ఏరియాలో అధికారులు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, డీజీఎం ఐఏడీ చంద్రశేఖర్, సివిల్ డీజీఎం పద్మరాజు, సివిల్ ఇంజినీర్లు సాయినాథ్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కోల్‌సిటీ: పెన్షన్‌దారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఈనెల 28న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ ప్రతినిధులు వీరగోని పెంటయ్య, బి.డానియేల్, జె.దేవదానం పిలుపునిచ్చారు. అన్నిప్రైవేట్ ఆస్పత్రుల్లో పెన్షన్‌దారులకు నగదు రహిత వైద్యం అందించాలని, జూలై నుంచి ప్రభుత్వం మూడు డీఏలు వెంటనే చెల్లించాలన్నారు.

ఉపాధి హామీ గ్రామసభ

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలం కల్వచర్లలో సోమవారం ఉపాధిహామీ గ్రామ సభ నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో రూ.85 లక్షలతో చేపట్టిన పనులు, కూలీల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేసి గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గంట పద్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డుసభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులు.. నాణ్యమైన బోధన



మండల ప్రాథమిక పాఠశాల



తరగతి గదుల్లో డెస్క్‌లు

- ప్రాథమిక పాఠశాలలో అన్ని వసతులు
- విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన
- ఆహ్లాదకరంగా పాఠశాల ఆవరణ

రామగుండం: ఏటా నూతన విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం అమలు చేసే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులను గుర్తించడం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులను ఒప్పించడం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం తెలిసిందే. కాగా బడిబాట ర్యాలీతో సంబంధం లేకుండా సదరు పాఠశాలలో సీటు లభిస్తే చాలు అనేందుకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనం.

మండల పరిధిలోనే రెండోస్థానం...

పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రామగుండం మండల పరిధిలో రెండోస్థానంలో ఉంది. ఇటీవల మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. ఎంపీపీఎస్‌లో ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 122, ఆరు తరగతి గదులు, ఇందులో ఒక డిజిటల్ తరగతి గది, అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, క్రీడా ప్రాంగణం. ఆకట్టుకునే విధంగా వివిధ రకాల పూల మొక్కలు. దాని సమీపంలోనే కిచెన్‌గార్డెన్ పాఠశాల ప్రత్యేకత. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ఆకుకూరలు, కూరగాయలు పండించనున్నారు.



డిజిటల్ విద్యాబోధన

ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన ఫలితాలు

ప్రతీ సంవత్సరం ఐదో తరగతి పూర్తి చేసుకొని వెళ్లే విద్యార్థులకు దాదాపు సమానంగా నూతన ప్రవేశాలు వస్తాయి. బడిబాటతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు వచ్చి అడ్మిషన్ తీసుకుంటారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.



– ఆకుల మనోహర్ రావు, హెచ్‌ఎం

వెంకట్రావుపల్లిలో సమస్యలు పరిష్కరించండి



శ్రీధర్ బాబుకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నాయకులు చాట్లా సదానందం, నాయకుడు బత్తిని శ్రీనివాస్ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిశారు. ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతమైన వెంకట్రావుపల్లి కేకే నగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీటితోపాటు మురుగునీరు ఇళ్లలోకి వస్తుందన్నారు. పాములు, విషపు రుగులు సైతం ఇంట్లోకి రావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. తగు చర్యలు చేపట్టేలా మంథని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్పందించిన శ్రీధర్ బాబు త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

రత్నాపూర్‌లో వందశాతం ఇంటిపన్ను వసూళ్లు

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలంలోని రత్నాపూర్‌లో వందశాతం ఇంటి పన్ను వసూలు పూర్తయినట్లు సర్పంచ్ పల్లె ప్రతిమ, పంచాయతీ కార్యదర్శి పెండ్లి రమ్య తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు పన్నులు వసూలు చేశారని తెలిపారు. ఇందుకు సహకరించిన గ్రామస్తులకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



బస్ పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్

ధర్మారం: ఆర్టీసీ బలోపేతానికి ప్రతి గ్రామానికి విలేజ్ బస్ అధికారులను యాజమాన్యం నియమించిందని, ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను వినియోగించుకోవాలని సర్పంచ్ పుస్కూరి జితేందర్ రావు అన్నారు. ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆర్టీసీ విలేజ్ అధికారి కొమురయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వికలాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కరీంనగర్ నుంచి రాత్రివేళ ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ధర్మారం వరకు బస్సును నడిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, నాయకులు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశం గౌడ్, దేవి రాజలింగయ్య, వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు రాచమల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

'యువత సామాజిక సేవలో ముందుండాలి'

సుల్తానాబాద్: యువత సామాజిక సేవలో ముందుండాలని లయన్స్ క్లబ్ జిల్లా రెండో గవర్నర్ సింహరాజు కోదండరాం అన్నారు. సోమవారం పట్టణంలోని పూసాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యాపారులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుకురావాలన్నారు. లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా ఆడెపు సమ్మయ్య, కోశాధికారిగా రాయల్ల నవీన్, ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటరమణ రెడ్డి, అడిషనల్ కార్యదర్శులు వలస నీలయ్య, మధుసూదన్ రెడ్డి, రీజియన్ చైర్మన్ గట్టు రాజయ్య, జోన్ చైర్మన్ కిషోర్, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ సీనియర్ సభ్యులు జగన్, కొమురవెల్లి చక్రధర్, దీకొండ భూమేశ్ కుమార్, సతీశ్ కుమార్, పిట్టల వెంకటేశ్, సంపత్, పోచమల్లయ్య, కౌశిక్ , సతీశ్, సాంబమూర్తి పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోదావరిఖని టౌన్: ఈనెల 30న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు తరలిరావాలని జిల్లా నాయకులు యాసర్ల తిమోతి కోరారు. జాతీయ కోర్ కమిటీ సభ్యుడు కొంద్ర శంకర్‌తో కలిసి సోమవారం కరపత్రం ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు 13 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. నాయకులు కొట్టెపల్లి దుర్గాప్రసాద్, శ్రీనివాస్, ఈర్ల ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, కుమ్మరి నవీన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఏబీవీపీ బంద్ విజయవంతం అయినట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రవీణ్, ఎస్‌డీసీ కన్వీనర్ రిషి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు డొనేషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదన్నారు. పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగచంద్ర, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



హెల్త్ కార్డులు అందజేస్తున్న ప్రసన్నకుమార్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల గ్రామంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చత్రపతి సాహు మహరాజ్ జయంతిని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గోదావరిఖని సిగ్మా హాస్పిటల్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి విద్యార్థులకు హెల్త్ కార్డులు అందజేశారు. బీఎస్పీ ప్రతినిధులు సంపత్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం. వెంకటరమణ, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.రవీంద్ర, హాస్పిటల్ సీఈఓ నరేశ్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులున్నారు.

సమ్మె నోటీస్ అందజేత

ఎలిగేడు: తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జూలై 6న నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడంతో సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో జీపీ ఉద్యోగ, కార్మికులు ఎంపీడీవో శ్రీనివాసమూర్తికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీపీ ఉద్యోగ, కార్మికులకు వేతనాలు అందజేయాలన్నారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె కొనసాగుతుందన్నారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లచ్చయ్య, కార్యదర్శి ఎండీ. ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి చంద్రయ్య, నా యకులు కొండయ్య, మొగిలి, సత్యనారాయణ, కొంద్ర నర్సయ్య, కార్మికులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మంథని: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సోమవారం మంథని ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా 1న పెన్షన్ చెల్లించాలని, పెండింగ్ డీఆర్‌లు ఇవ్వాలని కోరారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో 85 శాతం పెన్షనర్లు ఉన్నందున ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సంఘం సెక్రటరీ తనుగుల విజయ్‌కుమార్, ట్రెజరర్ కొమురోజు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, శశికళ, ఖాజా మోహినొద్దీన్, మోహన్ శర్మ, తదితరులున్నారు.

నేడు ఉపాధి మహిళా కూలీలకు శిక్షణ

జూలపల్లి : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ మహిళలకు మంగళవారం నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ ×ఉన్నతి¥ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు. వంద రోజులు పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాల నుంచి 35 మంది మహిళలను ఎంపికచేయగా వీరికి స్వయం ఉపాధి కల్పించేందుకు ఆగరు వత్తులు, వర్మీ కంపోస్ట్, క్యాండిల్స్, జనుపసంచులు, వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని, రోజూ కూలీ చెల్లిస్తారన్నారు.

ఇద్దరిపై కేసు

పెద్దపల్లిరూరల్: విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పెద్దపల్లిలోని సివిల్ సప్లైస్ గోదాం అధికారి తిరుపతి విధులు నిర్వహిస్తుండగా ఆటంకం కలిగించిన గోదావరిఖనికి చెందిన రేషన్ డీలర్ రాజమౌళితో పాటు మహిళా డీలర్ భర్త తిరుపతిపై కేసు నమోదు చేశామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ (గోదాం అధికారి) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్పొరేట్ దుకాణాల్లో మంగళసూత్రాలు కొనొద్దు

పెద్దపల్లిరూరల్: హిందూ వివాహ సంప్రదాయంలో మంగళసూత్రానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, నిష్ఠతో మంగళసూత్రాన్ని స్వర్ణకారులే చేస్తారని, వాటిని కార్పొరేట్ దుకాణాల్లో కొనుగోలు చేయవద్దని జిల్లా స్వర్ణకారసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగు శ్రీనివాస్, రాజు కోరారు. సంప్రదాయాలకు విరుద్ధంగా మాంగళ్యాన్ని తయారు చేసే వారికి దూరంగా ఉండాలన్నారు. నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, ఈశ్వరచారి ఉన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లి రూరల్: రైతులకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందించంతోపాటు సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌బీఐ సూచనల ప్రకారం బ్యాంకులు 18శాతం పంట రుణాలు ఇవ్వాలని జిల్లా అధ్యక్షుడు సదానందం కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రుణమాఫీ చేయాలన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి, కల్తీ ఎరువులను నియంత్రించాలన్నారు. ఇక్కడ సంఘం ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం నాయకులు కొంరయ్య, బాబన్న, వెంకటేశ్, తిర్రి బాలకృష్ణ, రాం చందర్ గౌడ్, రాజయ్య తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

- బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జి దాసరి ఉష



నాగులపల్లెలో ఇంటింటా సమస్యలు తెలుసుకుంటున్న దాసరి ఉష

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ నియోజక ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని నాగులపల్లె, తేలుకుంట గ్రామాల్లో బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం మన ఊరు, మన ఉష కార్యక్రమాన్ని 13వ రోజు నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసి, చత్రపతి సాహూ మహరాజ్ జయంతిని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, బస్సు సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీఎస్పీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, మహిళా కన్వీనర్ ఆముదాల అరుణ, మహిళా కో కన్వీనర్, అఖిల, మండల అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య, నాయకులు మల్లారపు మల్లేశ్, సంపత్, శ్రీనివాస్, బీవీఎఫ్ టీం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

కమాన్‌పూర్: మండలంలోని నాగారం ప్రభుత్వ పాఠశాలలో 2001–02 చదివిన ఏడో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: వచ్చేనెల 30న గోదావరిఖనిలో నిర్వహించే ప్రజాగర్జనను విజయవంతం చేయాలని తెలంగాణా లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఎ.తిరుపతి, వెంకటేశ్వర్లు, లింగయ్య, కిషోర్‌నాయక్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం



కమాన్‌పూర్ : సుమన్‌కు డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సతీశ్

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన పందిల్ల సుమన్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. రూ.లక్షా 55వేల155లను బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసిన డిపాజిట్ బాండ్‌ను సోమవారం సుమన్‌కు అందజేశారు. సుమన్ ఇటీవల రైలులో ముంబై వెళ్లే క్రమంలో ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సుమన్ కుటుంబాన్ని ఆదుకునేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు దాతల నుంచి సేకరించిన డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు. కోలేటి శివ, మెడగోని విజయ్, సాయి, రెడ్డి చైతన్య, మల్యాల మహేశ్, ఎండీ అప్సర్, జాకీర్, పంజా సాయిరాం, ప్రశాంత్, గోపగాని కుమార్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి...

జూలపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమతో కలిసి పదో తరగతి చదివిన మిత్రుడు మృతిచెందడంతో తోటి స్నేహితులు మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కమాన్‌పూర్ మండలం గుంటూరు పల్లెకు చెందిన నవీన్ జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నాడు. ఇటీవల నవీన్ అనారోగ్యంతో మృతిచెందడంతో తోటిమిత్రులు రూ.21,500లను మిత్రుడి కుటుంబానికి అందజేశారు.

'నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి'

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 2019 నుంచి 2023 వరకు గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయకుండా అధికారుల సహకారంతో నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులతో పాటు ఎస్‌ఎఫ్‌సీ, టీఎఫ్‌సీ, 13, 14వ ఆర్థిక సంఘం నిధులు గోల్‌మాల్ చేశారని పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఇక్కడ లింగయ్య, జమీల్, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులున్నారు.

దళితబంధు పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలి

పెద్దపల్లి రూరల్: ప్రభుత్వం దళితుల కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో ఎస్సీ ఉపకులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపకులాల పోరాటహక్కుల సమితి నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తంచేసి వినతిపత్రం అందజేశారు. రాజారాం, ఈశ్వరయ్య, ధర్మయ్య, తిరుపతి, కుమార్, రవీందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

శివుడికి నైవేద్యం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివ ఆలయంలో శ్రీ వారాహి దేవి గుప్త నవరాత్రుల్లో భాగంగా శివ లింగానికి డ్రై ఫ్రూట్స్‌తో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అమ్మవారు బృహత్ వారాహి దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పూజారి రమేశ్ అందజేశారు.

అనారోగ్యంతో రిటైర్డు వార్డెన్ మృతి

ఓదెల: మండలంలోని హరిపురంకు చెందిన కర్ర లింగారెడ్డి (85) రిటైర్డు వార్డెన్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. లింగారెడ్డి పెద్దపల్లి, సుల్తానాబాద్, కొలనూర్, ధర్మారం బీసీ హాస్టళ్లలో వార్డెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. కొంతకాలంగా అస్వస్థతకు గురైఇంట్లోనే మృతిచెందాడు.